క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం

పెడన: పట్టణంలోని బంటుమిల్లి రోడ్డు సెంటర్‌లో ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తొలి రోజు మజ్జిగ పంపిణీ చేశారు.

అన్నసమారాధన

పెడన: పాతపేటలోని ముత్యాలమ్మ ఘటం గుడి వద్ద ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. ప్రతి పౌర్ణమికి ఆలయ కమిటీ, పాత పేట భక్త బృందం ఆధ్వర్యంలో ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తారు. భక్తుడు చందన నారాయణరావు దంపతులు సహకరించారు.

శ్రీవారికి లక్ష మల్లెలతో అర్చన

వేకనూరు(అవనిగడ్డ): వేకనూరు వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి లక్ష మల్లెలతో అర్చన నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం రాత్రి స్వామి వారి కల్యాణోత్సవం కనుల పండువగా జరిపించారు. సర్పంచ్ తుంగల లక్ష్మీ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కార్తికేయుని ఆలయం కిటకిట

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది.

మండల టాపర్లకు బహుమతుల ప్రదానం

చల్లపల్లి: తల్లిదండ్రులు తమ బిడ్డలకు విద్యతో పాటు సమాజ నడవడిక నేర్పాలని, సమాజంతో కలిసి నడిచిన వారు ఖచ్చితంగా గొప్పవాళ్లు అవుతారని అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ అన్నారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య సత్రంలో ఎస్ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాల 1988–2020 బ్యాచ్ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి మండలాల్లో ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పదో తరగతి టాపర్లుగా నిలిచిన విద్యార్థినీ, విద్యార్థులు 23 మందిని సన్మానించి రూ.2 వేల చొప్పున నగదు బహుమతులు ప్రదానం చేశారు. విశ్రాంత ప్రిన్సిపాల్ తగిరిశ సాంబశివరావు, విజయవాడ పీబీ సిద్దార్థ కళాశాల ప్రిన్సిపాల్, ఎస్ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థి మేకా రమేష్ మాట్లాడారు. చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి మండల స్థాయి టాపర్లుగా నిలిచిన ముగ్గురు విద్యార్థినులకు కన్యకా పరమేశ్వరి కల్యాణ మంటపం అధ్యక్షుడు కొల్లిపర మధు రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతులు అందచేశారు. పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ కార్యాలయానికి నిప్పు

కోడూరు(అవనిగడ్డ): జనసేన పార్టీ కార్యాలయానికి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. స్థానిక కచేరీ కార్యాలయం పక్కనే ఉన్న ప్రైవేట్ భవనంలో జనసేన పార్టీ నాయకులు కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. శనివారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దుండగులు పార్టీ కార్యాలయ గోడలపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. గోడలపై ఉన్న ఫ్లెక్సీలు కాలిపోయాయి. రహదారికి అనుకొని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను దగ్ధం చేశారు. ఆదివారం ఉదయం ఈ విషయాన్ని గమనించిన పార్టీ నేతలు కోడూరు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ పి. రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కార్యాలయానికి ఉన్న సీసీ కెమెరాల వైర్లను దుండగులు పక్కకు తప్పించి ఘటనకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. పార్టీలో ఉన్న వర్గ విభేదాలే ఈ ఘటనకు కారణంగా పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు సమాచారం.

ఏటీఎంలో నగదు చోరీపై కేసు

కోనేరుసెంటర్: ఏటీఎంలో నగదు చోరీపై చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచిలీపట్నం మాచవరానికి చెందిన సుంకర క్రీస్తురాజు గత నెల 10వ తేదీన బస్టాండ్ సెంటర్ బెల్ కంపెనీకి సమీపంలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో డబ్బులు డ్రా చేసేందుకు వెళ్లాడు. డబ్బులు డ్రా చేయడం తెలియని క్రీస్తురాజు పక్కనే ఉన్న వ్యక్తికి తన కార్డు ఇచ్చి డబ్బులు డ్రా చేయించాడు. అనంతరం కార్డు తీసుకుని ఇంటికి వెళ్లిపోయాడు. ఇంటికి వెళ్లిన పది నిమిషాల్లో తన ఖాతాలోని రూ. 11,500 నగదు మరలా డ్రా చేసినట్లు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. ఏటీఎం కార్డును పరిశీలించగా అది నకిలీది అని గుర్తించాడు. ఏటీఎంలో డబ్బులు డ్రా చేసిన వ్యక్తి నకిలీ కార్డును తనకు ఇచ్చి తన కార్డును అతను దొంగిలించి డబ్బులు డ్రా చేసినట్లు గ్రహించిన క్రీస్తురాజు వెంటనే తన కార్డును బ్లాక్ చేశాడు. దీనిపై ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.



సాగుకు భరోసా

- రైతులకు మేలు చేసేలా ప్రభుత్వం చర్యలు
- పెట్టుబడి కోసం వైఎస్సార్ రైతు భరోసా ద్వారా నగదు జమ
- సబ్సిడీపై పంపిణీకి వరి విత్తనాలు సిద్ధం
- ఆర్బీకేల ద్వారా రైతులకు అందజేసేందుకు చర్యలు
- విత్తనాల నాణ్యత పరిశీలనలో అధికారులు


పెడన మండలం చేవేంద్ర గ్రామంలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

పెడన: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు మేలు చేసేలా చర్యలు చేపట్టింది. ఖరీఫ్ సాగుకు పెట్టుబడి కోసం ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా నగదును వారి ఖాతాలకు జమ చేసింది. సబ్సిడీపై వరి విత్తనాలను సిద్ధం చేసింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు అందించేందుకు చర్యలు చేపట్టింది. రైతులకు మేలు చేసేలా ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోంది. ఎరువులు, సబ్సిడీ పై యంత్రపరికరాలను అందిస్తోంది. సాగు ప్రారంభంలోనే అన్నదాతలకు మేలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో రైతులు కూడా ఉత్సాహంగా సాగుకు సిద్ధమవుతున్నారు. ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని రైతులు తమ పంట పొలాలను ఆదివారం దుక్కి దున్నడం ప్రారంభించారు. రైతులకు విత్తనాలను సమీపంలోని ఆర్‌బీకేలలో అందుబాటులో ఉంచాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం విత్తనాలను సరఫరా చేస్తోంది. ఆయా ఆర్‌బీకేలలో విత్తనాల డిమాండ్‌ను బట్టి, ప్రస్తుతం సరఫరాను దృష్టిలో ఉంచుకుని విత్తనాలను పంపిణీ చేస్తోంది.

ఆర్‌బీకేలకు చేరుతున్న విత్తనాలు..

పెడన నియోజకవర్గంలో 64 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. పెడన మండలంలో 18, బంటుమిల్లి మండలంలో 16, కృత్తివెన్ను మండలంలో 13, గూడూరు మండలంలో 17 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో ఆర్‌బీకేకు 40 బ్యాగులు, అంతకంటే ఎక్కువగా కూడా ప్రస్తుతం సరఫరా అవుతున్నాయి. పెడనలోని 18 ఆర్‌బీకేలకు ప్రస్తుతం తొమ్మిది ఆర్‌బీకేలకు విత్తనాలను సరఫరా చేశారు.


పెడన మండలం పెనుమల్లి ఆర్‌బీకేకి చేరిన వరి విత్తనాలను పరిశీలిస్తున్న వీఏఓ శిరీష

సాంబమసూరి 5204...ఎంటీయూ 1061

సాంబమసూరి (బీపీటీ) 5204, ఎంటీయూ 1061 రెండు రకాల విత్తనాలను సరఫరా చేశారు. ఈ రెండు రకాలకు సంబంధించి ఒక్కో రకం 20 బ్యాగులు చొప్పున మొత్తం 40 బ్యాగులను సరఫరా చేశారు. బీపీటీ ఒక బ్యాగులో 25 కిలోల విత్తనాలు ఉన్నాయి. ఎంటీయూ 1061కి సంబంధించి ఒక బ్యాగులో 30 కిలోల వరకు విత్తనాలు ఉన్నాయి.

ప్రతి లోడులో విత్తనాల మొలకశాతం పరిశీలన..

మండలాలకు చేరుతున్న వరి విత్తనాల నాణ్యతను పరిశీలించేలా వ్యవసాయ శాఖాధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం వస్తున్న విత్తనాల లోడులోని విత్తనాలను కొన్ని తీసి మొలక కడుతున్నారు. మొలక శాతాన్ని బట్టి ఎంత మొలకలు వచ్చిందనే విషయం పరిశీలించిన తరువాత వాటిని రైతులకు విక్రయించాలా వద్దా అనేది నిర్ణయిస్తారు. మొలక శాతం ఎక్కువగా ఉంటే ఆ విత్తనాలను విక్రయించేందుకు సిద్ధం చేయనున్నారు. ప్రతి కిలోకి రూ.5 సబ్సిడీని రైతులకు ఇవ్వనున్నారు. మొలకశాతం తక్కువగా ఉంటే ఆ విత్తనాలను వెనక్కు పంపించనున్నారు. ఒక్కో రైతుకు ఐదు ఎకరాల వరకు మాత్రమే విత్తనాలను ఎకరానికి 20 కిలోల చొప్పున ఇవ్వనున్నారు.

మొలక శాతాన్ని పరిశీలిస్తున్నాం



ప్రస్తుతం వచ్చిన లోడులోని విత్తనాల నాణ్యతను పరిశీలించేలా చర్యలు చేపట్టాం. వాటిని మొలక కట్టాం. రెండు, మూడు రోజుల్లో మొలకలు వస్తాయి. వచ్చిన మొలకల శాతం ఎక్కువగా ఉంటే వాటిని రైతులకు విక్రయించేందుకు అనుకూలంగా ఉన్నాయని గుర్తించి ఆ విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందజేస్తాం. ఏ రకమైనా కిలోకి రూ.5 సబ్సిడీ ఉంటుంది. బయటి మార్కెట్ కంటే తక్కువగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ధర కూడా నాలుగైదు రోజుల్లో తెలియజేస్తాం. మొలకశాతం పరిశీలన అనంతరం విత్తనాలను సిద్ధం చేస్తాం.

– జీవీ శ్రీనివాసరావు, ఏఓ, పెడన

ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు అభినందనీయం

ఎమ్మెల్యే పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నంలో ఇంటర్నేషనల్ స్కూల్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. నగర శివారు బందరుకోట రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన చాప్టర్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, ఎంయూడీఏ చైర్‌పర్సన్ బొర్రా దుర్గాభవానీలతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అమెరికాలో 20 ఏళ్ల పాటు ఉండి స్వస్థలంలో విద్యావ్యాప్తి చేయా లనే తలంపుతో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేసిన ఎం. సుజన్, మనోజ్‌లను ఎమ్మెల్యే అభినందించారు. ఇంటర్నేషనల్ స్టాండెండ్స్‌తో చిన్నారులకు ఆటపాటలతో విశాలమైన ఆటస్థలంతో స్కూల్‌ను సిద్ధం చేయడం అభినందనీయమన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) మాట్లాడుతూ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, జేఎన్‌టీయూ రిటైర్డ్ రెక్టార్ కె. సత్యప్రసాద్, డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, స్కూల్ చైర్మన్ ఎం. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


స్కూల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పేర్ని నాని, మేయర్ వెంకటేశ్వరమ్మ, బొర్రా దుర్గాభవానీ

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం

కోడూరు: వేద పండితుల మంత్రోచ్ఛరణలు.. మేళ తాళాలు.. పుష్ప పరిమళాలు.. భక్తుల జయజయ ధ్వానాల నడుమ శ్రీనివాసుడి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివార్ల కల్యాణాన్ని కమనీయంగా జరిపారు. టీటీడీకి చెందిన వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణ తంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు. కోడూరుకు చెందిన యిమ్మడి వెంకట రామకృష్ణ ప్రసాద్–గిరిజా, కోట సీతారమేష్–జ్యోతి, రేపల్లెకు చెందిన చిట్టా మురళీకృష్ణ–ప్రియాంక దంపతులు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. ప్రముఖ ఉపన్యాస వాచస్పతి మొవ్వ వృషాద్రిపతి కల్యాణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. స్వామి వారి, అమ్మ వారి గుణగణాలను భక్తులకు వివరించడంతో పాటు బ్రహ్మోత్సవాల పాటను ఆలపించి ఆకట్టుకున్నారు. దేవాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు లడ్డూలను భక్తులు రాంబాబు, మురళీకృష్ణ, హనుశ్రీలు రూ. 51,228లకు వేలం పాట ద్వారా దక్కించుకున్నారు.

ఆకట్టుకున్న చందన శోభితుడి అలంకారం..

కల్యాణాన్ని పురస్కరించుకొని కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి మూలమూర్తులకు చేసిన అలంకారం ఆకట్టుకుంది. వెంకన్నను చందన శోభితుడిగా అలంకరించి భక్తులకు దర్శనమందించారు. ఆలయ ప్రాంగణమంతా వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.


కల్యాణతంతు నిర్వహిస్తున్న కల్యాణకర్తలు, పండితులు

గరుడ, శేష వాహనాలపై ఊరేగింపు..

ఆదివారం గరుడ, శేష వాహనాలకు ప్రత్యేక పూజలు చేసి, వాటిపై కల్యాణమూర్తులకు తీరువీధి ఉత్సవం జరిపారు. కోడూరు, కృష్ణాపురం, ఇస్మాయిల్ బేగ్‌పేట, యర్రారెడ్డివారిపాలెం గ్రామాల్లో ఊరేగింపునకు భక్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయం వద్ద వసంతోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు.ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించగా, ప్రధాన అర్చకుడు దుంభాల శ్రీధరాచార్యులు తీర్థప్రసాదాలు అందించారు.

మొక్కజొన్న రైతుకు భరోసా ఇచ్చిన జగన్ ప్రభుత్వం

ఏరువాక కార్యక్రమంలో నిజాలు ఒప్పుకున్న బుద్ధప్రసాద్

మోపిదేవి(అవనిగడ్డ): గత నెలలో కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన మొక్కజొన్న రైతులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భరోసా ఇచ్చిందని మాజీ ఉప సభాపతి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మోపిదేవి మండలం బొబ్బర్లంకలో ఆదివారం నిర్వహించిన ఏరువాక కార్యక్రమంలో బుద్ధప్రసాద్ పాల్గొని మాట్లాడారు. గత నెలలో కురిసిన అకాల వర్షాలకు జరిగిన నష్టం అంతా ఇంతా కాదని, మొక్కజొన్న కానీయండి, పసుపు కానీయండి రైతులు ఎంతగా నష్టపోయారో చెప్పడం కష్టమని అన్నారు. తీవ్రంగా నష్టపోయిన రైతులకు భరోసా ఇచ్చిన ప్రభుత్వంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిలుస్తుందని మాత్రం మనవి చేస్తున్నానని ఫ్లోలో మాట్లాడేశారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించి వ్యవసాయ పనులు ప్రారంభించారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం



చిలకలపూడి(మచిలీపట్నం): నగరంలోని రుస్తుంబాద మున్సిపల్ హైస్కూల్ 1997–98 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. పాఠశాల ప్రాంగణంలో కలుసుకున్న విద్యార్థులు ఒకరికొకరు ఆత్మీయంగా పలుకరించుకుని క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణ అంతా తిరిగి నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఆటపాటలతో రోజంతా ఆనందంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించి ఆశీర్వాదం పొందారు.

వైభవంగా స్వామివార్ల గ్రామోత్సవం

మచిలీపట్నంటౌన్: రాబర్ట్‌సన్‌పేటలోని రంగనాయక స్వామి, రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో స్వామివార్ల వార్షిక కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం రంగనాయక స్వామి ఆలయంలో ఉదయం అవబృదోత్సవం, పూర్ణాహుతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ధ్వజారోహణం బచ్చు రామకృష్ణ, రమావాణి దంపతుల ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం స్వామి వార్లను హనుమంత వాహనంపై ఆశీనులను చేసి గ్రామోత్సవం నిర్వహించారు. క్యాంప్‌బెల్‌పేటకు చెందిన లక్ష్మీలీలా భాగవతారిణి ఆధ్వర్యంలో ప్రదర్శించిన శ్రీనివాస కల్యాణం హరికథా కాలక్షేపం, మచిలీపట్నానికి చెందిన నాగరాజు బృందం ఆధ్వర్యంలో సత్యహరిశ్చంద్ర నాటకంలోని కాటిసీను భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమాలను ఆలయ ఈఓ కందుల వేణుగోపాలరావు పర్యవేక్షించారు. రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి అవబృదస్నానం, వసంతోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం నందివాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరిగింది. సాయి మారుతి నాట్య మండలి మచిలీపట్నం బృందంచే ఆలయ ఆవరణలో ప్రదర్శించిన శ్రీ కృష్ణ రాయబారం పడక సీను నాటక ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. పూజా కార్యక్రమాలను ఆలయ ఈఓ ఆంజనేయస్వామి పర్యవేక్షించారు.

జగన్ ఆదర్శ పాలనకు ప్రజల ఆదరణ

అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు


సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

చల్లపల్లి: పేదల గడప వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తూ వారి అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తూ ఆదర్శ పాలన అందిస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. చల్లపల్లి గ్రామ సచివాలయం–4 పరిధిలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం జరిగింది. ఎమ్మెల్యే రమేష్‌బాబు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని అధికారం చేపట్టిన నాటి నుంచే అమలు చేసి చూపించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. చంద్రబాబు హామీలు ఎన్నికల ముందే గుర్తుకు వస్తాయన్నారు. మేనిఫెస్టో మాయం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మోపిదేవి ద్వారకానాథ్, తుమ్మల వెంకటేశ్వరరావు, మండల ఇన్‌చార్జి ఇంకొల్లు శేషగిరి, వక్కలగడ్డ సర్పంచ్ వల్లూరు ఉమా, చల్లపల్లి, మాజేరు పీఏసీఎస్ చైర్మన్లు పాగోలు నాగ సీతారామారావు (ఫణి), అరజా శివశంకర్, ఏఎంసీ డైరెక్టర్ మోతుకూరి ఏడుకొండలు, నాయకులు పాల్గొన్నారు.

కానూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం


స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: మండల పరిధిలోని కానూరు గ్రామంలో ఆదివారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు ఇంటింటికి వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుని ప్రభుత్వ పథకాలను వివరించారు. అన్నివర్గాలకు మేలు చేస్తున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కిట్టు కోరారు. సర్పంచ్ చెక్కా ఆదిలక్ష్మి, గ్రామ ఇన్‌చార్జి చెక్కా ఏడుకొండలు, ఉప సర్పంచ్ గోపు మురళి, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గణపాబత్తుల చూడామణి, సొసైటీ అధ్యక్షుడు బొమ్మిడి సత్యనారాయణ, వార్డు సభ్యుడు గణపాబత్తుల సత్యనారాయణ, గ్రామ పెద్ద చెక్కా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ధ్యానం, యోగాలో శిక్షణ



మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారానికి 28వ రోజుకు చేరుకున్నాయి. విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు, ధ్యానం, యోగా నేర్పారు. సరస్వతీ దేవి ప్రార్థన చేసిన అనంతరం కథలు చెప్పి పుస్తకాలు చదివించారు. ఉపాధ్యాయిని జయలక్ష్మీ పిల్లలకు వైకుంఠపాళి, ఖర్చీఫ్ ఆట, కోలాటం ఆడించారు. సూర్య నమస్కారాలు, జీకే పై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఈడేపల్లి, చిలకలపూడి గ్రంథాలయాల్లో కూడా విద్యార్థులకు పై అంశాల్లో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాలను ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్ పర్యవేక్షించారు.

అవనిగడ్డ: స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. తెలుగు పద్యాలు చదవడం, చెప్పడం, కథలు చెప్పడం ఇంగ్లిష్ గ్రామర్, చిత్రలేఖనం, భగవద్గీత పారాయణం, శ్లోకాలు చదివించడం వంటివి నేర్పించారు. ఇంగ్లిష్ టీచర్ ఎ. సీతారామ్, ఆధ్యాత్మిక గురువు మత్తి శేషగిరిరావు, బి. కృపారావు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయ అధికారి జుజ్జువరపు ప్రభుదాస్ పర్యవేక్షించారు.

లక్ష్యాల సాధన ద్వారా ఉన్నత శిఖరాలు


పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ఎంఈఓ ప్రసాద్ తదితరులు

బంటుమిల్లి: విద్యార్థులు లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధన ద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని బంటుమిల్లి ఎంఈఓ కేఎస్‌వీ ప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పెడనకు చెందిన సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు ప్రతిభ అవార్డులను అందజేశారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన చర్యలతో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా మంచి ఫలితాలను సాధిస్తున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తుండటంతో విద్యార్థులు సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి మంచి మార్కులు సాధించారని చెప్పారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా మాట్లాడుతూ పేద విద్యార్థులకు విద్యా సంబంధమైన అవసరాలు తీర్చేందుకు సంస్థ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. అనంతరం బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోను, కళాశాలల్లోను పది, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో కె. సాంబశివరావు, ఆర్. ప్రసాద్, పి. నాగబాబు, మస్తాన్‌బేగ్ పాల్గొన్నారు.





